# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 14వ అధ్యాయము

### ప్రవచన వరములు, భాషలు

ప్రేమ కలిగి యుండుటకు ప్రయాసపడుడి ఆత్మ సంబంధమైన వరములను ఆసక్తితో అపేక్షించుడి విశేషముగా మీరు ప్రవచనవరము అపేక్షించుడి 2 ఎందుకనగా భాషతో మాటలాడువాడు మనుష్యులతో కాదు దేవునితో మాటలాడుచున్నాడు మనుష్యుడెవడును గ్రహింపడు గాని వాడు ఆత్మవలన మర్మములను పలుకుచున్నాడు. 3 క్షేమాభివృద్ధియు, హెచ్చరికయు ఆదరణయు కలుగునట్లు, ప్రవచించువాడు మనుష్యులతో మాటలాడుచున్నాడు. 4 భాషతో మాటలాడువాడు తనకే క్షేమాభివృద్ధి కలుగజేసికొనును గాని ప్రవచించువాడు సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగజేయును. 5 మీరందరు భాషలతో మాటలాడవలెనని కోరుచున్నాను గాని మీరు ప్రవచింపవలెనని మరి విశేషముగా కోరుచున్నాను. సంఘము క్షేమాభివృద్ధి పొందు నిమిత్తము భాషలతో మాటలాడువాడు అర్థము చెప్పితేనే గాని, వాని కంటే ప్రవచించు వాడే శ్రేష్టుడు.

6 సహోదరులారా, ఆలోచించుడి భాషలతో మాటలాడుచు నేను మీయొద్దకు వచ్చి సత్యమును బయలుపరచవలెననియైనను జ్ఞానోపదేశము చేయవలెనని యైనను, ప్రవచింపవలెననియైనను, బోధింపవలెననియైనను మీతో మాటలాడక పోయిన యెడల నా వలన మీకు ప్రయోజనమేమి? 7 పిల్లనగ్రోవి గాని, వీణె గాని నిర్జీవ వస్తువులు నాదమిచ్చునప్పుడు స్వరములలో భేదము కలుగజేయనియెడల ఊదినదేదో, మీటినదేదో ఏలాగు తెలియును? 8 మరియు బూర స్పష్టము కాని ధ్వని ఇచ్చినప్పుడు, యుద్ధమున కెవడు సిద్ధపడును? 9 ఆలాగే మీరు స్పష్టమైన మాటలు నాలుకతో పలికితే గాని, పలికినది ఏలాగు తెలియును? మీరు గాలితో మాటలాడుచున్నట్టుందురు. 10 లోకమందు ఎన్నో విధములగు భాషలున్నను వాటిలో ఒకటైనను సృష్టము కానిదైయుండదు. 11 మాటల అర్థము నాకు తెలియకుండిన యెడల మాటలాడు వానికి నేను పరదేశినై యుందును. మాటలాడువాడు నాకు పరదేశిగా ఉండును. 12 మీరు ఆత్మసంబంధమైన వరముల విషయమై ఆసక్తి గలవారు గనుక సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగు నిమిత్తము అవి మీకు విస్తరించునట్లు ప్రయత్నము చేయుడి 13 భాషతో మాటలాడువాడు అర్థము చెప్పు శక్తి కలుగుటకై ప్రార్థన చేయవలెను. 14 నేను భాషతో ప్రార్థన చేసిన యెడల నా ఆత్మ ప్రార్థన చేయును గాని నా మనస్సు ఫలవంతముగా ఉండదు. 15 కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును ఆత్మతో పాడుదును మనస్సుతోను పాడుదును. 16 లేనియెడల నీవు ఆత్మతో స్తోత్రము చేసినప్పుడు ఉపదేశము పొందనివాడు నీవు చెప్పుదానిని గ్రహింపలేడు గనుక నీవు కృతజ్ఞతాస్తుతులు చెల్లించినపుడు – ఆమేన్ అని వాడేలాగు పలుకును ? 17 నీవైతే బాగుగానే కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నావు కాని ఎదుటివాడు క్షేమాభివృద్ధి పొందడు. 18 నేను మీ అందరి కంటె ఎక్కువగా భాషలతో మాటలాడుచున్నాను, అందుకు దేవుని స్తుతించెదను. 19 అయినను సంఘములో భాషతో పదివేల మాటలు పలుకుట కంటే, ఇతరులకు బోధ కలుగునట్లు నా మనస్సుతో అయిదు మాటలు పలుకుట మేలు. 20 సహోదరులారా, మీరు బుద్ధి విషయమై, పసిపిల్లలు కాక దుష్టత్వము విషయమై, శిశువులుగా ఉండుడి బుద్ధి విషయమై పెద్దవారలై యుండుడి 21 అన్యభాషలు మాటలాడు జనుల ద్వారాను, పరజనుల పెదవుల ద్వారాను ఈ జనులతో మాటలాడుదును అప్పటికైనను వారు నా మాట వినక పోదురు అని ప్రభువు చెప్పుచున్నాడని ధర్మశాస్త్రములో

వ్రాయబడియున్నది. 22 కాబట్టి, భాషలు విశ్వాసులకు కాదు అవిశ్వాసులకే సూచకమైయున్నది. ప్రవచించుట అవిశ్వాసులకు కాదు విశ్వాసులకే సూచకమైయున్నది. 23 సంఘమంతయు ఏకముగా కూడి అందరూ భాషలతో మాటలాడుచుండగా ఉపదేశము పొందని వారైనను, అవిశ్వాసులైనను లోపలికి వచ్చిన యెడల మీరు వెర్రి మాటలాడుచున్నారని అనుకొందురు గదా ? 24 అయితే అందరు ప్రవచించు చుండగా అవిశ్వాసియైనను ఉపదేశము పొందనివారైనను, లోపలికి వచ్చిన యెడల, అందరి బోధవలన తాను పాపినని గ్రహించి, అందరి వలన విమర్శింపబడును. 25 అప్పుడతని హృదయ రహస్యములు బయలుపడును. ఇందువలన దేవుడు నిజముగా మీలో ఉన్నాడని ప్రచురము చేయుచు అతడు సాగిలపడి దేవునికి నమస్కారము చేయును.

## ఆరాధన క్రమము అవసరము

26 సహోదరులారా, ఇప్పుడు మీలో ఏమి జరుగుచున్నది ? మీరు కూడివచ్చునప్పుడు ఒకడు ఒక కీర్తన పాడవలెనని యున్నాడు, మరియొకడు బోధింపవలెనని యున్నాడు, మరియొకడు తనకు బయలు పరచబడినది ప్రకటన చేయవలెనని యున్నాడు. మరియొకడు భాషతో మాటలాడవలెనని యున్నాడు మరియొకడు అర్థము చెప్పవలెనని యున్నాడు. సరే, సమస్తమును క్షేమాభివృద్ధి కలుగుటకై జరుగనీయుడి 27 భాషతో ఎవడైనను మాటలాడితే ఇద్దరు, అవసరమైన యెడల ముగ్గురికి మించకుండ వంతుల చొప్పున మాటలాడవలెను. ఒకడు అర్థము చెప్పవలెను. 28 అర్థము చెప్పువాడు లేనియెడల అతడు సంఘములో మౌనముగా ఉండవలెను గాని, తనతోను దేవునితోను మాటలాడుకొనవచ్చును. 29 ప్రవక్తలు ఇద్దరు ముగ్గురు మాటలాడవచ్చును. తక్కినవారు వివేచింపవలెను. 30 అయితే కూర్చున్న మరియొకనికి ఏదైనను బయలు పరచబడినయెడల మొదటి వాడు మౌనముగా ఉండవలెను. 31 అందరు నేర్చుకొనునట్లును, అందరు హెచ్చరిక పొందునట్లును మీరందరు ఒకని తరువాత మరియొకడు ప్రవచింపవచ్చును. 32 మరియు ప్రవక్తల ఆత్మలు ప్రవక్తల స్వాధీనము లోనున్నవి. 33 ఆలాగే పరిశుద్ధుల సంఘములన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్త గాని అల్లరికి కర్తగాడు. 34 స్త్రీలు సంఘములలో మౌనముగా ఉండవలెను వారు లోబడియుండవలసినదే గాని, మాటలాడుటకు వారికి సెలవు లేదు. ఈలాగు ధర్మశాస్త్రమును చెప్పుచున్నది. 35. వారు ఏమైనను నేర్చుకొనగోరినయెడల, ఇంట తమ తమ భర్తలను నడుగవలెను సంఘములో స్త్రీ మాటలాడుట అవమానము. 36 దేవుని వాక్యము మీ యొద్దనుండియే బయలువెళ్ళెనా? మీ యొద్దకు మాత్రమే వచ్చెనా? 37 ఎవడైనను తాను ప్రవక్తననియైనను, ఆత్మ సంబంధిననియైనను తలంచుకొనిన యెడల, నేను మీకు వ్రాయుచున్నవి ప్రభువు యొక్క ఆజ్ఞలను అతడు దృఢముగా తెలిసికొనవలెను. 38 ఎవడైనను తెలియని వాడైతే తెలియని వాడుగానే యుండనిమ్ము. 39 కాబట్టి నా సహోదరులారా, ప్రవచించుట ఆసక్తితో ఆపేక్షించుడి భాషలతో మాటలాడుట ఆటంక పరచకుడిగాని 40 సమస్తమును మర్యాదగాను క్రమముగాను జరుగనియ్యుడి